సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 21 | జూలై | 2024



ఉధృతంగా గోదావరి

ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

- 8లో▸



అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎండు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
32.5^0 / 23.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రుల పర్యటన వాయిదా



భూపాలపల్లి రూరల్/గణపురం: వర్షాల నేపథ్యంలో ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రుల పర్యటన వాయిదా పడినట్లు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఉదయం వర్షంలోనే తడుస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి గణపురం మండలం గాంధీనగర్ శివారులోని ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాట్ల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలను రద్దు చేసినట్లు చెప్పారు. త్వరలోనే శంకుస్థాపన తేదీలను ప్రకటిస్తామని, ఈ విషయాన్ని కాంగ్రెస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మంగీలాల్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి, చిట్యాల సీఐలు నరేష్, మల్లేష్, భూపాలపల్లి, గణపురం ఎస్సైలు ప్రసాద్, సాంబమూర్తి, హైదరాబాద్ హెడ్ ఆఫీస్ ఇండస్ట్రియల్ జీఎం రవి, ఇండస్ట్రియల్ వరంగల్ జోనల్ మేనేజర్ స్వామి తదితరులు ఉన్నారు.

డిజిటల్ ఎక్స్‌రే ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటుచేసిన డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను శనివారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం ప్రారంభించినట్లు తెలిపారు. అంతకుముందు సింగరేణి మహిళా ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాల్లో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంపును జీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఏసీఎంఓ డాక్టర్ పద్మజ, సింగరేణి సేవా అధ్యక్షురాలు సయ్యద్ జానుబేగం, అధికారులు, వైద్యులు తుకారాం, డాక్టర్ శ్రావణ్‌కుమార్, వెంకటరామిరెడ్డి, సురేఖ, భిక్షపతి, బాలరాజ పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధచూపాలి



చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.రాజేందర్ అన్నారు. శనివారం మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకునేలా ప్రతిరోజు ఇంటి వద్ద తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి సీఎంఓ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో కీలకం

మొగుళ్లపల్లి: విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి నెల సమావేశానికి తల్లిదండ్రులు పాల్గొని పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాఠశాలను తాను దత్తత తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా డీఈఓ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు తిరుమల, సీఎంఓ సామల రమేష్, ఎంఈఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతినిధులకు అభినందనలు

పలు విధాలుగా పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న కాలిన్స్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులకు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ అభినందనలు తెలిపారు. శనివారం మండలంలోని ఇస్సిపేట ఉన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్లు, రంగాపూర్, మొగుళ్లపల్లి, మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు మూడు కంప్యూటర్లను కాలిన్స్ ఏరోస్పేస్ ప్రతినిధులు బహుకరించారు.

రూ.10వేల ఆర్థికసాయం

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. శనివారం పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశానికి హరీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కావాల్సిన టై, బెల్ట్ ఏర్పాటు చేసేందుకు నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వాసాల స్వప్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కాటారం: పోతుల్వాయి బొర్రవాగు వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న వరదనీరు

ముసురేసింది..

జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం మొదలైన వర్షం మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వరద నీరు భారీగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు మండలాల్లో పాత ఇళ్లు కూలిపోయాయి. పత్తి చేలు నీటమునిగాయి. మహదేవపూర్, పలిమెల మండలాల్లో శనివారం సహాయక చర్యల్లో కలెక్టర్, ఎస్పీ పాల్గొని ప్రజలతో మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

మూడురోజులుగా ఎడతెరిపి లేని వర్షం
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు
- లోలెవల్ కాజ్‌వేలపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు
- సహాయక చర్యల్లో కలెక్టర్, ఎస్పీ

నిలిచిపోయిన రాకపోకలు

కాటారం: కాటారం మండలంలోని పోతుల్వాయి సమీపంలోని బొర్రవాగు, గుండ్రాత్‌పల్లి సమీపంలోని అలుగువాగు ఉప్పొంగి ప్రవహించాయి. వరదనీరు కాజ్‌వేలపై నుంచి ఉధృతంగా పోవడంతో చింతకాని, మహాముత్తారం మండలానికి, గుండ్రాత్‌పల్లి, మహదేవపూర్ మండలం అన్నారం వైపు గల గ్రామాలకు మండలం మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. శంకరాంపల్లిలో శ్రీనివాస్ ఇంటిపై కప్పు, తిరుపతి ఇంటి గోడ కూలిపోయాయి. గుమ్మాళ్లపల్లి సమీపంలోని మైసమ్మ కుంట తూముకు గండిపడింది. జాదారావుపేట సమీపంలోని వంతెన కొంత భాగం కోతకు గురికావడంతో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ పరిశీలించి మరమ్మతు చర్యలను దగ్గరుండి చేయించారు. కాటారం ఎస్సీ కాలనీలో వరదనీరు చేరింది. వరదనీరుకు పత్తి మొక్కలు పూర్తిగా మునిగిపోవడంతో రైతులకు నష్టం జరిగింది. పోతుల్వాయి వాగు, అలుగు వాగులను మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, సీఐ నాగార్జునరావు, తహసీల్దార్ నాగార్జున, ఎస్సై అభినవ్ పరిశీలించారు.



శంకరాంపల్లిలో కూలిన ఇంటి కప్పు

అత్యవసర సేవలకు టోల్ ఫ్రీ నంబర్

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నందున అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూం నంబర్ 90306 32608 లేదా టోల్ ఫ్రీ నంబర్ 18004251123కు కాల్ చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి తీర ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడుతున్నందున, అన్ని ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల జరుగుతుందన్నారు. గోదావరి నది ప్రవాహం పెరుగుతున్నందున కాళేశ్వరం, పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్లవద్దన్నారు. ప్రజలు గోదావరి తీర ప్రాంతంలోకి స్నానాలకు గాని ఇతర పనులకు గాని వెళ్లరాదన్నారు. పశువులను ఆరుబయట మేతకు వదలొద్దని, జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని పేర్కొన్నారు.

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం/పలిమెల: గోదావరి పరీవాహక ప్రాంతమైన మహదేవపూర్, పలిమెల మండలాల్లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే పర్యటించారు. మహదేవపూర్ మండలం పెద్దంపేట వాగు వంతెనను పరిశీలించారు. జిల్లాలో అత్యవసర పరిస్థితులలో ఉపయోగించే వాటర్ బోట్ పనితీరును పరిశీలించారు. గోదావరిలో బోటులో ప్రయాణించి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు మారుమూల గ్రామమైన దమ్మూరుకు చేరుకొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ..అత్యధిక వర్షపాతం నమోదవుతుందని జిల్లాలో గోదావరి నది తో పాటు ఇతర వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాలో 10 మంది సుశిక్షితులైన సిబ్బందితో వాటర్ బోట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారివెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ హేమ, ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ సాయిలు, ఎస్సైలు పవన్, తమాషారెడ్డి ఉన్నారు.



కాళేశ్వరం: కూలిన టస్సర్ కాలనీలోని నేతకార్మికుని ఇంటిగోడ

టస్సర్‌కాలనీలో కూలిన ఇంటి గోడ

మహదేవపూర్ మండల కేంద్రం టస్సర్ కాలనీలోని నేతకార్మికుడి ఇంటి గోడ వర్షానికి కూలింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోడ కూలినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

జాయింట్ కలెక్టర్ పర్యటన



మహాముత్తారం: లోలెవల్ కాజ్‌వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

మహాముత్తారం: కేశవాపూర్, పెగడపల్లి మధ్య లోలెవల్ కాజ్‌వేను మండల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం మండలంలోని లోతట్టు గ్రామమైన యత్నారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. వర్షాలు అధికంగా ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు ఎక్కువ ఉంటే గ్రామస్తులను గ్రామంలోని పాఠశాలలకు తరలించి.. అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని లోలెవల్ కాజ్‌వేను పరిశీలించి మరమ్మతుల కోసం త్వరలో నిధులు మంజూరు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై మహేందర్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు, చెట్లు

నిమ్మగూడెం గ్రామంలోని ప్రధాన రహదారిలో భారీ వృక్షం నేలకొరిగింది. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. ఒక విద్యుత్ స్తంభం నిలిపి ఉన్న ఆటోపై పడడంతో ఆటో పాక్షికంగా దెబ్బతిన్నది. పెగడపల్లి వద్ద పంచాయతీ అధికారులు రహదారికి అడ్డంగా కంచె ఏర్పాటు చేశారు.

పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల-ఖమ్మపల్లి, అడవి సోమన్‌పల్లి రెండు జిల్లాల సరిహద్దు మానేరు పోటెత్తింది. మల్లారం ఆరెవాగు మానేరు ఉధృతంగా ప్రవహిస్తుంది.



ఉరకలేస్తున్న అడవి సోమన్‌పల్లి మానేరు

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తి నిలిచి పోయిందని ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి తెలిపారు. వర్షాల కారణంగా 1.30 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ, ఆరు వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు.



ఓసీపీలోకి చేరిన వరదనీరు

కూలిన ఇల్లు



కూలిపోయిన ఇల్లు

భూపాలపల్లి: వర్షాలతో భూపాలపల్లి పట్టణంలోని ఓ ఇల్లు వెనుక భాగం పూర్తిగా కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి సుభాష్‌కాలనీ సమీపంలో గల మదీన నగర్‌లో నివాసం ఉండే మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు షేక్ మోహిన్ పాషా ఇల్లు వెనుక భాగంలోని రెండు గదులు పూర్తిగా కూలిపోయాయి. దీంతో ఇంట్లోని సామగ్రి దెబ్బతింది.



కాళేశ్వరం: పలిమెల వద్ద గోదావరిలోకి బోటులో వెళ్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే



కాటారం: రేగులగూడెంలో నీటమునిగిన పత్తి

కుక్కలు, కోతుల బెడద

- పారిశుద్ధ్యం, రోడ్ల సమస్యలతో ఇబ్బందులు
- చెత్తతో నిండిపోతున్న ఖాళీస్థలాలు
- మున్సిపల్ కమిషనర్‌కు పట్టణవాసుల విన్నపం
- పరిష్కరిస్తామని కమిషనర్ హామీ
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన



సాక్షి ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ రాజేశ్వర్

భూపాలపల్లి అర్బన్: పారిశుద్ధ్యం, రోడ్ల సమస్య, కుక్కల, కోతుల బెడద తదితర సమస్యలు పరిష్కరించాలని భూపాలపల్లి పట్టణవాసులు మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు ఏకరువు పెట్టారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌తో 'సాక్షి' శనివారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలు వార్డులు, కాలనీల నుంచి ప్రజలు ఫోన్లుచేసి సమస్యలను కమిషనర్‌కు విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కారానికి హామీఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికులకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తను మురికి కాలువలు, రోడ్డుపై పడేయకుండా ట్రాలీల్లో వేయాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పడేసే వారిపై చర్యలు తీసుకొని జరిమానాలు విధిస్తామన్నారు. పట్టణ ప్రజలకు మెప్మా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

ప్రశ్న: డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదు.. చేసినప్పుడు మట్టి కుప్పలను వెంటనే తరలించడం లేదు.

– రంజిత్ సుభాష్‌కాలనీ

కమిషనర్: మున్సిపాలిటీలో కార్మికుల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలకొకసారి తప్పనిసరిగా డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్నారు. కాల్వల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులు వేయడంతో కాల్వల్లో చెత్త పేరుకుపోతుంది. చెత్తను కాల్వలో వేయకుండా సహకరించాలి.

ప్రశ్న: విలీన గ్రామాలను పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్యం లేదు.. దోమల నివారణ చర్యలు లేవు..

– పోలవేన రాజేందర్, వేశాలపల్లి

కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాలకు సేవలు అందిస్తున్నాం. ఎటువంటి వ్యత్యాసాలు లేవు. వేశాలపల్లిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కాలువలను శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మిషన్ భగీరథ నీరు రావడం లేదు.

– అబ్దుల్ ఫాజిల్, రాజీవ్‌నగర్ కాలనీ, ముజీమ్, కారల్‌మార్క్స్ కాలనీ

కమిషనర్: రాజీవ్‌నగర్ కాలనీలో మిషన్ భగీరథ నీరు రాకపోవడానికి గల కారణాలను తెలుసుకుంటాం. ఇంజనీరింగ్ విభాగం అధికారులు వచ్చి పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న: పట్టణ ప్రధాన రహదారిలో పశువులు ఉంటున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లి

కమిషనర్: రోడ్లపై పశువులు సంచరిస్తున్న విషయం వాస్తవమే. ఇప్పటికే పశువుల యాజమానులకు నోటీసులు జారీచేశాం, త్వరలోనే వాటిని తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: శాంతినగర్‌లో ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతుంది.

– ప్రభు, శాంతినగర్‌కాలనీ, సతీష్, సుభాష్‌కాలనీ

కమిషనర్: ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు పట్టణంలో చెత్తతో నింపేస్తున్నారు. ఖాళీ ప్లాట్ల యాజమానులకు నోటీసులు ఇస్తాం. చెత్త పడేసే వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: అంబేడ్కర్ సెంటర్‌లో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి.

– ఎరుకల గణపతి, జవహర్‌నగర్‌కాలనీ

కమిషనర్: అంబేడ్కర్ సెంటర్‌లో పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. ఈ సమస్యను అతి త్వరలోనే పరిష్కరిస్తాం. పోలీస్, మున్సిపాలిటీ అధికారుల సమన్వయంతో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: అంబేడ్కర్ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ రోడ్డుకు సైడ్ కాలువలు నిర్మించాలి.

– పరుశరాం, రాజు, శ్రీనివాస్, పోలీస్‌స్టేషన్ రోడ్డు

కమిషనర్: అంబేడ్కర్ సెంటర్ నుంచి కృష్ణకాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా సైడ్ కాల్వలు నిర్మించేందుకు టెండర్ పూర్తయింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా పనులు ప్రారంభం కాలేదు. కాల్వల నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తాం.

ప్రశ్న: సుభాష్‌కాలనీలో కుక్కలు, పందుల బెడద అధికంగా ఉంది.

– సాయికిరణ్, రాజమౌళి, సుభాష్‌కాలనీ

కమిషనర్: పందులను ఇప్పటికే తరలించాం. ఇంకా మిగిలి ఉన్న పందులను కాపాలదారులు పట్టణానికి దూరంగా పంపించాలి. కుక్కల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభిస్తాం.

ప్రశ్న: చెత్త సేకరణకు కార్మికులు రావడం లేదు.

– రఘు, ఎల్‌బీనగర్ కాలనీ

కమిషనర్: చెత్త సేకరణ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది. సిబ్బంది కొరత, ఇతర పనుల నిమిత్తం ఒక్కోసారి రాకుండా ఉండొచ్చు. క్రమం తప్పకుండా చెత్త సేకరించేలా సిబ్బందికి ఆదేశాలు జారీచేస్తాం.

ప్రశ్న: ఉదయం కార్మికులు వచ్చి వెళ్లేది తెలియడం లేదు.

– కోరె సుధాకర్, భూపాలపల్లి మెయిన్‌రోడ్

కమిషనర్: చెత్త సేకరణ ట్రాలీలు, ఆటోలకు ఉన్నటువంటి కొన్ని మైకులు చెడిపోయాయి. వాటిని మరమ్మతు చేయించి పాటలు వచ్చేలా ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: మోనోకార్పస్ చెట్లను తొలగించాలి.

– రఫిక్, భూపాలపల్లి

కమిషనర్: పట్టణంలోని ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో ఉన్న మోనోకార్పస్ చెట్లను త్వరలోనే తొలగిస్తాం. పాలకవర్గ సభ్యులు కూడా తీర్మానం చేశారు.

ప్రశ్న: జంగేడు నుంచి వేశాలపల్లి వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.

– కొదారి రాజు, మోదే రాజు, వేశాలపల్లి

కమిషనర్: జంగేడు నుంచి వేశాలపల్లికి వెళ్లే దారిని పరిశీలించి విద్యుత్ స్తంభాలు ఉంటే వెంటనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తాం. లేనిపక్షంలో కొంత సమయం పడుతుంది.

ప్రశ్న: రెడ్డికాలనీ బస్టాండ్ ఎదురుగా రోడ్డు వెడల్పులో భాగంగా ఉన్నటువంటి మురికి కాలవ పైపులైన్ తొలగించారు. మళ్లీ నిర్మించడం లేదు.

– నరేష్, నవీన్‌కుమార్, రెడ్డికాలనీ

కమిషనర్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా రోడ్డు పనులు జరగడం లేదు. సిబ్బందిని పంపించి తాత్కాలిక ఏర్పాటు చేయిస్తాం. పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: పోలీస్ స్టేషన్ రోడ్డులో చికెన్ సెంటర్ల వ్యర్థాలతో దుర్వాసన వస్తుంది.

– వైనాల శోభన్, పోలీస్‌స్టేషన్ రోడ్డు

కమిషనర్: పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఉన్న చికెన్ సెంటర్ల యజమానులతో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మంజూర్‌నగర్ వెంగల్‌రావు వెంచర్‌లో రోడ్ల నిర్మాణాలు చేపట్టి పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టాలి.

– శ్రీనివాస్, మంజూర్‌నగర్

కమిషనర్: వెంగల్‌రావు వెంచర్‌లో రోడ్లు లేకపోవడం వలనే తరుచుగా తాగునీటి పైపులు పగులుతున్నాయి. కాలనీలో రోడ్లు, కాల్వల నిర్మాణాలు చేపడుతాం. కాల్వలు శుభ్రం చేయిస్తాం.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ఘటనలూ చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం ప్రభావంపై శనివారం కలెక్టర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాతో పాటు మంథని నియోజకవర్గంలోని పలు మండలాల్లో లోతట్టు గ్రామాల పరిస్థితిపై మంత్రి ఆరాతీశారు. భారీ వర్షాలు, వరదనీటి ప్రవాహాల కారణంగా గ్రామాల్లో ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి జిల్లా అధికారులను ఆదేశించారు. వాగులు, చెరువుల నీరు చేరే అవకాశం ఉన్న లోతట్టు గ్రామాల ప్రాంత ప్రజలను గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదావరినది పరివాహక ప్రాంతాల్లో, కాలువలు, చెరువుల ప్రాంతాల్లో పశువులు, మేకలను మేపడానికి, చేపల వేటకు వెళ్లొద్దని మంత్రి ప్రజలకు సూచించారు. ప్రజలు అధికారులకు సహకరించి వారి సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. అధికారులు గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు.



మంత్రి శ్రీధర్‌బాబు

ఉధృతంగా గోదావరి

మారుమూల గ్రామాల నుంచి బాధితుల తరలింపు

- ప్రమాదాన్ని అంచనా వేస్తున్న అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండి కళకళలాడుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతి అంచనా వేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏటూరునాగారం మండలంలో 75 మిల్లీమీటర్లు, మంగపేట 11.5 మిల్లీమీటర్లు, వాజేడు 26 మిల్లీమీటర్లు, వెంకటాపూర్ 14.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కన్నాయిగూడెం మండల వ్యాప్తంగా 43.8 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇలా మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి ఉప నదులు ఉప్పొంగి గోదావరిలో వరద అధిక మొత్తంలో చేరుతోంది. ఈ కారణంగా తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్ వద్ద గోదావరి శనివారం సాయంత్రం నాటికి 79. 2 0 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అధికారులు శుక్రవారం మధ్యాహ్నం నుంచి బ్యారేజీకున్న 59 గేట్లు ఎత్తివేయడంతో నీరు బ్యారేజ్ నుంచి ఉరకలేస్తూ కింది ప్రాంతానికి ప్రవహిస్తుంది. దీంతో రామన్నగూడెం వద్ద గోదావరి ఉధృతి గంటగంటకూ పెరుగుతోంది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద సాయంత్రం నాటికి 12.21 మీటర్ల చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవహిస్తోంది. ఐటీడీఏ, జలవనరుల శాఖల అధికారులు ఎప్పటికప్పుడు గోదావరి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ఉన్నతాధికారులు, సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు.


రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద పెరుగుతున్న గోదావరి ఉధృతి

లోతట్టు ప్రాంతాల నుంచి బాధితుల తరలింపు

మండలంలోని కొండాయి, ఎలిశెట్టి గ్రామాల సమీపంలో జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా మరపడవలను ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం ఇద్దరు మహిళలు తీవ్ర అస్వస్థ గురికాగా వారిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా ఎలిశెట్టిపల్లి సమీపంలో కూడా జంపన్న వాగు అదే వేగంతో ప్రవహిస్తోంది. కాగా, గర్భిణులు దబ్బగట్ల శైలజ, పులిసె అనూష పురిటి నొప్పులతో బాధపడుతుండగా పడవల సాయంతో వారిని వాగు దాటించి ఆసుపత్రికి తరలించినట్లు పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సందీప్, ఏఎన్ఎం ఆదిలక్ష్మి తెలిపారు.


కొండాయి వద్ద స్ట్రెచర్‌పై అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలిని తీసుకొస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

వరద ప్రవాహం ఇంకా పెరిగే అవకాశాలు ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

రాకపోకలు నిషేధం..

మండలంలోని ఎలిశెట్టిపల్లి గ్రామానికి వాగు దాటి వెళ్లొద్దని అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వాగులో నుంచి సాహసం చేయొద్దని తెలిపారు. ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని తెలిపారు. ఏదైనా అవసరం ఉంటే తమకు సమాచారం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కోరారు.

కోతకు గురైన కరకట్ట..

కరకట్ట పరిస్థితి దినదినగండంగా మారింది. ఒక చోట కోత గురైందని ఇసుక బస్తాలు వేస్తే మరో చోట కోతకు గురవుతూ వస్తోంది. కలెక్టర్ దివాకర పరిశీలించిన 7 కిలోమీటర్ల ప్రాంతం కంటే ఇప్పుడు 6 కిలోమీటర్ల వద్ద కోతకు గురవుతూ వస్తోంది. దీనిని గమనించి ఇరిగేషన్‌శాఖ అధికారులు కర్రలను పాతి ఇసు బస్తాలు, ట్యూబ్స్ ద్వారా గోదావరి నది కరకట్టకు తాకకుండా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతంలో గండిపడితే రామన్నగూడెం గ్రామం ఆనవాళ్లు లేకుండా పోయే ప్రమాదం ఉంది.


ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి నుంచి పడవలో గర్భిణులను దాటిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది


ఎలిశెట్టిపల్లి వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు


రామన్నగూడెం పుష్కరఘాట్‌కు 6కిలోమీటర్ల దూరంలో కోతకు గురవుతున్న గోదావరి కరకట్ట

వరదకోతకు గురవుతున్న వాగు ఒడ్డు


వాగుఒడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న జనావాసాలు

మంగపేట: మండలంలోని రాజుపేట ముసలమ్మవాగు వరద ఉధృతికి ఒడ్డు కోతకు గురవుతోంది. దీంతో ఒడ్డు వెంట నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తిమ్మాపురం అటవీ ప్రాంతం నుంచి ప్రవహించే వాగు రెండేళ్లుగా వర్షాకాలంలో భారీ వరదల కారణంగా బ్రిడ్జి సమీపంలో 15మీటర్ల వెడల్పుతో సుమారు 300 మీటర్లకు పైగా ఒడ్డు కోతకు గురైంది. అదే విధంగా బ్రిడ్జికి అవతలివైపు గల చెరుకుమిట్ట ప్రాంతంలో సుమారు 20 మీటర్లకు పైగా వెడల్పుతో 400 మీటర్ల వరకు ఒడ్డు కోతకు గురైంది. దీంతో బ్రిడ్జి సమీపంలోని బట్టు సతీశ్, దావీద్, భాస్కర్, ముగ్గల చెన్నయ్య నాలుగు కుటుంబాలకు చెందిన ఇళ్ల వరకు ఇప్పటికే ఒడ్డు కోతకు గురైంది. దీంతో ఆ కుటుంబాలతో పాటు గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ ప్రాంతాన్ని మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్, మేడారం ట్రస్టుబోర్డు డైరెక్టర్ కొమరం అబ్బయ్య, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి శనివారం సందర్శించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

20.9 ఫీట్లకు చేరిన పాకాల నీటిమట్టం


నీటితో కళకళలాడుతున్న పాకాల సరస్సు

ఖానాపురం: మండలంలోని ప్రధాన నీటి వనరు పాకాల సరస్సు నీటి మట్టం 20.9 ఫీట్లకు చేరుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు కాగా మరో 2.3 ఫీట్ల నీరు చేరితే ఆయకట్టు పరిధిలో పంటలకు నీరు సరిపోయే అవకాశం ఉంటుంది. సరస్సులోకి నీరు చేరుతుండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాలధారలా.. భీమునిపాద జలపాతం


సీతానగరం శివారు అడవిలో పాలధారలా భీమునిపాద జలపాతం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని సీతానగరం శివారు కొమ్ముల వంచ సమీప దట్టమైన అడవిలోని భీమునిపాద జలపాతం శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి పాలధారలా జాలువారుతోంది. పర్యాటకులు చేరుకొని జలపాతాన్ని వీక్షిస్తూ నీటిలో ఆటలాడారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వెంకటాపురం(కె): మండలంలోని ఆలుబాక పంచాయతీ పరిధి తానిపర్తి గ్రామానికి చెందిన బానారి రాజు(45) గురువారం గోదావరిలో చేపల వేటకు వెళ్లి గల్లంతు కాగా శనివారం అతడి మృతదేహం లభ్యమైంది. రాజు మృతదేహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి రేవు సమీపంలో గోదావరిలో లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు సున్నంబట్టి రేవు గ్రామానికి వెళ్లి పరిశీలించి రాజు మృతదేహంగా గుర్తించారు.



మేడిగడ్డకు వరద పోటు..

- కాళేశ్వరం వద్ద 9.100 మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం
- అన్నారం వద్ద 17వేలు, మేడిగడ్డకు 3.73 లక్షల క్యూసెక్కుల వరద
- ప్రాణహిత ద్వారా ఉధృతంగా తరలివస్తున్న వరద


కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన దిగువ నుంచి తరలివెళ్తున్న వరద


కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతి

కాళేశ్వరం : తెలంగాణ, మహారాష్ట్రల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులకు వరద జోరు పెరిగింది. తెలంగాణలోని గోదావరి, మహారాష్ట్రలో ప్రాణహిత నదికి వరద తాకిడి పెరగడంతో శనివారం ఎగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం(సరస్వతి) బ్యారేజీ వద్ద మానేరు వాగు నుంచి వరద 17వేల క్యూసెక్కులు తరలివచ్చింది. బ్యారేజీలోని మొత్తం 66 గేట్లు పూర్తిగా ఎత్తి నీటిని దిగువకు వదలగా కాళేశ్వరం చేరుతోంది. అటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గడ్చిరోలి జిల్లా మీదుగా ప్రాణహిత నది వరద ఉధృతి పెరుగుతోంది. ఆ వరద నీరు అంతా కలిసి కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద కలుస్తోంది. దీంతో కాళేశ్వరం పుష్కరఘాట్ల వద్ద 9.100 మీటర్లు ఎత్తులో నీటిప్రవాహం తరలిపోతుంది. కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన దిగువ నుంచి తరలి మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకి చేరుతుంది. బ్యారేజీవద్ద 3.73 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. బ్యారేజీలో మొత్తం 85గేట్లు పైకి ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు తరలిస్తున్నారు. రాత్రి వరకు మరింత పెరిగే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

సమ్మక్క బ్యారేజీకి భారీగా వరదనీరు..

కన్నాయిగూడెం: కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ సమీపంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం భారీగా పెరుగుతోంది. శనివారం బ్యారేజీలోకి 4,82,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. బ్యారేజీ 59గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 79.20మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. అదే విధంగా వాజేడు మండలం పేరూరు వద్ద శుక్రవారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 12.73 మీటర్లు ఉండగా శనివారం సాయంత్రానికి 13.14 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో గంటకు పది సెంటీమీటర్ల చొప్పున గోదావరి నీటిమట్టం పెరుగుతుందని పేరూరు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు.


సమ్మక్క సాగర్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి

అధికారులు అప్రమత్తం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి.దీంతో కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాగులు లోలెవల్ వంతెనల మీదుగా వరద పారుతున్న నేపథ్యంలో అధికారుల బృందం శనివారం చంద్రుపల్లి వాగు, కాళేశ్వరం గోదావరి నదిని పరిశీలించి సిబ్బందికి రక్షణ చర్యలకు సూచనలిచ్చారు. గోదావరిలో స్నానాలకు అనుమతించొద్దని, వాగులపై నుంచి దాటకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్సై చక్రపాణి, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- రూ.12 లక్షల విలువైన 60 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఇతర పోలీస్ అధికారులు

తొర్రూరు: తొర్రూరు డివిజన్ కేంద్రంలో శనివారం ఎండు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. ఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని గోపాలగిరి క్రాస్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ బొలెరో వాహనం అనుమానాస్పదంగా, వేగంగా వస్తుండగా నిలుపగా నలుగురు పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా 33 ప్యాకెట్లలో 60 కిలోల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.12 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఒడిశాకు చెందిన ముఠా ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు ప్రాంతం మీదుగా జహీరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ఒడిశాకు చెందిన ప్రహ్లాద్ సిసా, అప్పన్న బైరాగి, మిథుల సిసా, బసొతి పంగిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఎండు గంజాయితో పాటు రవాణాకు వినియోగించిన బొలెరో వాహనాన్ని, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేశారు. ఈ కేసులో పలువురి కానిస్టేబుళ్లకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ రివార్డులు అందించారు. సమావేశంలో సీఐ సంజీవ, ఎస్సైలు పిల్లల రాజు, గండ్రాతి సతీశ్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

కేయూ క్రాస్ వద్ద ముగ్గురు..

- 1.2 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ సంజీవ


మాట్లాడుతున్న సీఐ సంజీవ

హసన్‌పర్తి: ముగ్గురు గంజాయి వ్యాపారులు అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి 1.2కిలోల గంజాయితో పాటు మూడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంజీవ తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీ క్రాస్ వద్ద ఎస్సై రాజ్‌కుమార్ బృందం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కేయూసీ కంపౌండ్ వాల్ సమీపంలో ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే పోలీసులు అక్కడి చేరుకోగా గమనించిన ఇద్దరు యువకులు పరారయ్యారు. ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నగరంలోని నయీంనగర్ ప్రాంతానికి చెందిన మంద సాయిగణేశ్, ఇనుగాల సన్నీ, దుంపేటి రాకేశ్‌గా చెప్పారు. దీంతో ముగ్గురి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ తెలిపారు.

కాజీపేటలో ఇద్దరు క్రయవిక్రయదారులు..

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఏరియాలో శనివారం గంజాయి క్రయవిక్రయాలు జరుపుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేట సీఐ వై.సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి కాజీపేట రైల్వే ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండి పోలీసులను చూసి పారిపోవడానికి యత్నిస్తుండగా పట్టుకున్నారు. వీరిని కాజీపేటకు చెందిన పాలెపాక సందీప్, వరంగల్‌కు చెందిన పద్య శ్రీగోపాలశర్మగా గుర్తించారు. వారి వద్ద ఉన్న కవర్లను తనిఖీ చేయగా గంజాయి లభించింది. సందీప్‌కు కాజీపేట సోమిడికి చెందిన కుమ్మరి వరుణ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. 15 రోజుల క్రితం వరుణ్ వైజాగ్ నుంచి 2 కిలోల గంజాయి తీసుకొచ్చి సందీప్‌కు అమ్మమని ఇచ్చి వైజాగ్ వెళ్లాడు. సందీప్ అందులో నుంచి కొంత సరుకు అమ్మాడు. రెండు రోజుల క్రితం వరుణ్ ఫోన్ చేసి కాజీపేటకు శ్రీగోపాల్ శర్మ అనే వ్యక్తి వస్తాడు అతడికి కొంత గంజాయిని అమ్మమని సందీప్‌కు చెప్పాడు. 200 గ్రాముల గంజాయిని ప్యాక్ చేసుకోని రైల్వే కమ్యూనిటీహాల్ వద్ద గోపాల్‌శర్మకు ఇస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.35 వేల విలువైన 1.6 కిలోల గంజాయి, రూ.15వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, వరుణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో ఎనిమిదేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం నిందితుడిపై పోక్సో నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పెగడపల్లికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక రెండు రోజుల క్రితం అదే ప్రాంతంలో ఉన్న సుమన్ అనే యువకుడి ఇంటికి వెళ్లింది. తన తల్లికి ఫోన్ చేయడం కోసం మొబైల్ అడిగింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఆ యువకుడు బాలికలను ఇంట్లోకి తీసుకెళ్లి నగ్నం చేసి అసభ్యకరంగా ప్రవర్తించి లైంగికదాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి అక్కడినుంచి ఇంటికి వెళ్లింది. తల్లికి జరిగిన ఘటనను వివరించింది. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. లైంగిక దాడికి యత్నించడం వాస్తవంగా తేలడంతో సుమన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ చెప్పారు.

తల్లిదండ్రులు లేని జీవితం ఎందుకుని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య
- పెగడపల్లిలో ఘటన


హరీశ్(ఫైల్)

హసన్‌పర్తి: తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో వారు లేని జీవితం తనకు ఎందుకని మనస్తాపం చెందిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన పిన్నింటి హరీశ్(30) తల్లిదండ్రులు కొంత కాలం క్రితం మృతి చెందాడు.అప్పటి నుంచి ఇంటిలో ఒక్కడే ఉంటూ మానసిక వేదనకు గురవుతున్నాడు. తల్లిందండ్రులు లేకుండా ఒంటరి జీవితం ఎలా గడపాలని భావించిన హరీశ్.. ఈనెల 18వ తేదీన పురుగుల మందుతాగాడు. ఎంజీఎం తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

- వెండి కిరీటం, హుండీలో డబ్బు అపహరణ

కేసముద్రం: ఆలయ తాళం పగులగొట్టి అందులోని వెండికిరీటం, హుండీలోని డబ్బు అపహరించిన ఘటన మండలంలోని సబ్‌స్టేషన్ తండాజీపీలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. సబ్‌స్టేషన్‌తండాజీపీలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న దుర్గమ్మ ఆలయ తాళాన్ని శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. సుమారు రూ. 40 వేల విలువైన 417 గ్రాముల అమ్మవారి వెండికిరీటంతోపాటు, హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బు అపహరించారు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు చోరీ జరిగినట్లు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై వంశీధర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏజెన్సీలో జ్వరంతో యువకుడి మృతి


దళ్‌సింగ్ (ఫైల్)

బయ్యారం: ఏజెన్సీలో జ్వరంతో బాధపడుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బంజరతండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ దళ్‌సింగ్(33)కు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబసభ్యులు మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఆరు నెలల కుమారుడు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొని మహిళ మృతి

- ప్రమాద సమయంలో కారులోనే రాజయ్య
- బాపూజీనగర్ వద్ద వాహనం వదిలి వెళ్లిన వైనం



మహిళ మృతదేహం.. బాపూజీనగర్‌లో వదిలివెళ్లిన కారు

మడికొండ: స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కారు ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మడికొండ ఎస్సీ కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కలకొట్ల స్వప్న(40) పనినిమిత్తం నడుచుకుంటూ ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొట్టింది. ఆమెకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాద సమయంలో రాజయ్య కారులోనే ఉన్నాడని, అయితే కారును డ్రైవర్ నడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం అనంతరం కారును మాత్రం బాపూజీనగర్‌లో రోడ్డుపై వదిలిపెట్టిపోయారు. మృతురాలికి భర్త రాజు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.